సాక్షి
అనంతపురం
గురువారం । 15 । మే । 2025



ఖరీఫ్ సాగులో వైవిధ్యం
జిల్లాలో కంది,మొక్కజొన్న, కొర్ర తదితర పంటల సాగు పెరిగింది. వేరుశనగ, పత్తి సాగు తగ్గింది. 8లో



చీనీ టన్ను రూ.31,200
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31,200 పలికాయి.

గరిష్టం/కనిష్టం
42.7°/22.5°
జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హనుమద్ వాహనంపై నృసింహుడి విహారం
• నేడు శ్రీవారి కల్యాణోత్సవం



హనుమద్ వాహనంపై ఊరేగుతున్న భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడు

ఉరవకొండ రూరల్: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు బుధవారం హనుమద్ వాహనంపై విహరించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం భూదేవి, శ్రీదేవి సమేతంగా హనుమద్ వాహనంపై కొలువు దీర్చి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీస్వామి, ఉత్సవ ఉభయదాతలు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుర్రం సుధాకర్, గుర్రం రవీంద్రనాథ్ పాల్గొన్నారు.
• బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అత్యంత కీలకమైన స్వామి వారి కల్యాణోత్సవం ఉంటుంది. అలాగే,గరుడ వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పిడుగుపాటుతో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని మానిరేవు పంచాయతీ ఓబుళాపురంలో జరిగింది. వివరాలు.. ఓబుళాపురం గ్రామానికి చెందిన రామలింగ (40)కు భార్య అశ్విని, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గొర్రెల కాపరి అయిన రామలింగ రోజులాగే బుధవారం తన గొర్రెలను మేపు కోసం గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే వర్షం కురవడంతో ఓ చెట్టు చాటుకి వెళ్లాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో రామలింగ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న రామలింగ మృతి చెందడంతో భార్యాపిల్లలు బోరున విలపించారు.

పాలిసెట్‌లో 93 శాతం ఉత్తీర్ణత



హారిక మోహన్



మహమ్మద్ అస్లాం

అనంతపురం: డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్లకు నిర్వహించిన ఏపీ పాలిసెట్ -2025లో జిల్లా విద్యార్థులు 93.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 7,908 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 7,363 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 4,824 మంది హాజరుకాగా, 4,443 (91.89 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. బాలికలు 3,084 మంది హాజరుకాగా, 2,930 (95.01 శాతం) పాస్ అయ్యారు.

హారికకు మొదటి ర్యాంకు
పాలిసెట్‌లో జిల్లాకు చెందిన నిమ్మనపల్లి హారిక మోహన్ రాష్ట్ర స్థాయిలో 54వ ర్యాంకు, జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. మొత్తం 119 మార్కులతో సత్తా చాటింది. మేథమేటిక్స్‌లో 49 మార్కులు, ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 30 మార్కులు సాధించింది.
• పగిడి మహమ్మద్ అస్లాం జిల్లా స్థాయి రెండో ర్యాంకు(రాష్ట్ర స్థాయిలో 107)సాధించాడు. మొత్తం 118 మార్కులతో ప్రతిభ కనబరిచాడు. ఈ విద్యార్థికి మేథమేటిక్స్‌లో 49 మార్కులు, ఫిజిక్స్‌లో 39, కెమిస్ట్రీలో 30 మార్కులు వచ్చాయి.

మహిళపై హోంగార్డు దాడి

పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో హోంగార్డు దాడి చేయడంతో ఓ మహిళ గాయపడింది. బాధితురాలు తెలిపిన మేరకు.. కడవకల్లు గ్రామంలో తనుజ ఇంటి పక్కనే హోంగార్డు రాజశేఖర్ నివాసముంటున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం తన ఇంటి వద్ద తనుజ దుస్తులు ఉతుకుతున్న సమయంలో రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళుతూ తన కాలు తగిలించాడు. దీంతో ఆమె చూసుకుని వెళ్లాలంటూ హోంగార్డుకు సూచించింది. ఆ సమయంలో హోంగార్డు రెచ్చిపోయి 'నాకే చెబుతావా?' అంటూ ఆమె గొంతు పట్టుకుని నోటిని అదిమిపెట్టి విచక్షణారహితంగా చితకబాదాడు. గాయపడిన బాధితురాలు డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదుకు ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నట్లుగా తెలిసింది. దాడికి పాల్పడిన హోంగార్డును కాపాడేందుకు కేసును నిర్వీర్యం చేస్తున్నారంటూ కడవకల్లు వాసులు అసహనం వ్యక్తం చేశారు.

అనకొండల్ని ఆపేదెవరు?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సహజ వనరుల లూటీ విచ్చలవిడిగా జరుగుతోంది. మట్టి, ఇసుక, గ్రావెల్ మొదలుకొని అన్నింటినీ 'తెలుగు తమ్ముళ్లు' దోపిడీ చేస్తున్నారు. 'పచ్చ' నేతల హస్తం ఉండటంతో తనిఖీలకు వెళ్లేందుకు మైనింగ్ అధికారులు జంకుతున్నారు.



అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలోని పెద్దకొండ వద్ద టీడీపీ నాయకుల మట్టి దోపిడీకి నిదర్శనం ఈ చిత్రం (ఫైల్)

సహజ వనరుల స్వాహాపర్వం
• ఉమ్మడి అనంతపురం జిల్లాలో విచ్చలవిడిగా దోపిడీ
• రోజూ వందలాది టిప్పర్ల ఇసుక, మట్టి కర్ణాటకకు
• కొండలు కరిగిపోతున్నా.. గుట్టలు నేలమట్టమవుతున్నా ఎవరికీ పట్టని వైనం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మట్టి, ఇసుక, గ్రావెల్ తదితర వాటిని వాణిజ్య అవసరాలకు తరలించే వాహనాల నుంచి రాయల్టీ డబ్బు వసూలు చేసేందుకు ప్రభుత్వం ఏదైనా ప్రైవేటు సంస్థకు లీజు కట్టబెట్టేది. లీజు దక్కించుకున్న సంస్థ నెలానెలా ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో కొంత మొత్తం చెల్లించేది. దీంతో ప్రభుత్వానికి ఆదాయం లభించేది. అయితే, జిల్లాలో ప్రైవేటు సంస్థ లీజు గడువు మార్చితోనే ముగిసింది. తర్వాత ఇప్పటివరకూ ఎవరికీ ఇవ్వలేదు. దీంతో అప్పటి నుంచి సహజ వనరుల అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

11 మాసాల్లోనే కొండల నేలమట్టం..
'కూటమి' అధికారంలోకి వచ్చిన 11 మాసాల్లోనే అనంతపురం సమీప ప్రాంతాల్లో కొండలు కరిగిపోయాయి. గుట్టలు నేల మట్టమయ్యాయి. రాప్తాడు నియోజకవర్గంలోని క్రిష్ణంరెడ్డి పల్లి గుట్టలను కరిగించేశారు. రోజూ ఇక్కడి నుంచి వంద నుంచి 150 టిప్పర్ల మట్టి కర్ణాటకకు పంపిస్తున్నారు. ఇక్కడికి ఇద్దరు మైనింగ్ అధికారులు వెళ్లి వెనక్కు వచ్చారు. మహిళా అధికారులు మట్టి దొంగలను నిలువరించలేకపోయారు. ఇక.. ఆలమూరు కొండలంటే ఈ ప్రాంతంలో ప్రసిద్ధి. పశుపక్ష్యాదులకు ఆలవాలంగా ఉండటమే కాదు రాప్తాడు, అనంతపురం ప్రాంతాలకు రక్షణ కవచంలా ఉండేవి. అలాంటి కొండలను నేలమట్టం చేశారు. చివరకు కరెంటు పోళ్లు కూడా కిందపడిపోయేలా మట్టిని తవ్వారు. స్థానిక టీడీపీ నేత ఆధ్వర్యంలో అక్రమ వ్యవహారం ఇష్టారాజ్యంగా జరుగుతోంది.

కరిగిపోయిన నేమకల్లు గుట్టలు
రాయదుర్గం నియోజకవర్గం నేమకల్లులో జరుగుతున్న మైనింగ్.. రాష్ట్ర చరిత్రలోనే పెద్దదిగా చెప్పొచ్చు. మైనింగ్ డాన్‌గా పేరుగాంచిన టీడీపీ నేతలిద్దరు భారీగా క్రషర్‌లు పెట్టి కొండలను పిండి చేస్తున్నారు. ఆరు హెక్టార్లు లీజు ఉంటే 50 ఎకరాల్లో తవ్వుతున్నారు. రూ.20 కోట్ల పెనాల్టీ వేస్తే దాన్ని మాఫీ చేయించుకునేందుకు యత్నిస్తున్నారు.

'తాడిపత్రి'లో విచ్చలవిడిగా...
తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి, పెద్దపప్పూరు మండలాల్లో ఇసుక, మట్టి దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. పెద్దపప్పూరు మండలంలోని సోమనపల్లి, తిమ్మనచెరువు గ్రామాల్లో విచ్చలవిడిగా మట్టిని తవ్వి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా చర్యలు తీసుకునేవారే లేరు.

ఆత్మకూరు మండలంలో తారస్థాయికి..
ఆత్మకూరు మండలంలో ఎర్రమట్టి దందా తారస్థాయికి చేరింది. 'తెలుగు తమ్ముళ్ల' మట్టి దందాను అప్రతిహతంగా కొనసాగిస్తున్నారు. అనంతపురం కళ్యాణదుర్గం రోడ్డు ప్రాంతం మొత్తం ఇప్పటికే వెంచర్లతో నిండిపోయింది. ఈ క్రమంలో ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేతలు ఎలాంటి గ్రావెల్ లీజులు లేకుండానే కొండలను పిండి చేసి అక్రమంగా మట్టి రవాణా సాగిస్తున్నారు.

హిందూపురంలో పట్ట పగలే దోపిడీ..
హిందూపురం పట్టణం చుట్టూ ఉన్న రూరల్ ప్రాంతాల నుంచి మట్టి యథేచ్ఛగా కర్ణాటకకు తరలిస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకుంటున్నా వినకుండా మట్టి తోలుతున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల అండగా తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. ఎక్కడ చూసినా మట్టి, ఇసుక టన్నుల కొద్దీ కర్ణాటకకు వెళ్లిపోతోంది.

లీజు ఉన్న సమయంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయ వివరాలు ఇలా..

నెల	రాయల్టీ సొమ్ము
2024 డిసెంబర్	రూ.9.5 కోట్లు
2025 జనవరి	రూ.9.8 కోట్లు
2025 ఫిబ్రవరి	రూ.9.6 కోట్లు
ప్రైవేటు లీజు రద్దయిన తర్వాత రాయల్టీ ఇలా..	
2025 మార్చి	రూ.1.20 కోట్లు
2025 ఏప్రిల్	రూ.1.27 కోట్లు

ధర్మవరం నియోజకవర్గంలో..
ధర్మవరం నియోజకవర్గంలోని చిత్రావతి నది నుంచి రోజూ వందలాది టిప్పర్ల ఇసుక అక్రమంగా తోలుతున్నా పట్టించుకునే దిక్కులేదు. ప్రధాన హైవేలోనే నిర్భయంగా టిప్పర్లు వెళుతున్నా రెవెన్యూ అధికారులు గానీ, మైనింగ్ అధికారులు గానీ వాహనాలను పట్టుకోలేదు. టీడీపీ వాహనాలు అనగానే పోలీసులు వాటికి రాచబాట వేసి మరీ బార్డరు దాటిస్తున్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి దోపిడీ



కొండను తవ్వి మట్టిని తరలించిన దృశ్యం

రాయదుర్గం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతల దోపిడీకి అంతులేకుండా పోతోంది. సహజ వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టి రూ. కోట్లలో దోచేస్తున్నారు. టీడీపీ నేతల స్వార్థానికి రాయదుర్గం నియోజకవర్గంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. గత రెండు రోజులుగా రాయదుర్గంలోని శనీశ్వరాలయం వెనుక ఉన్న హౌసింగ్ లే అవుట్‌కు ఆనుకుని కొండ ప్రాంతంలో మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్నారు. అదే ప్రాంతంలో కొండ పొరంబోకు స్థలంలో భారీ విస్తీర్ణాన్ని చదును చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ఓ టీడీపీ నాయకుడు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే పేర్కొంటున్నారు. ఎంసీపీ కళాశాల, ఇందిరమ్మ లేఅవుట్లు, గౌడ లేవుట్ సమీపంలో ఉన్న కొండల్లో నుంచి గ్రావెల్ తవ్వకాలు పెరిగిపోయాయి. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్లకు, ప్రైవేటు వ్యక్తులు తమ స్థలాలను ప్లాట్లు వేసి, రోడ్లను చదును చేసేందుకు కొండల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం తెలిసినా భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విత్తనకాయల పంపిణీకి సిద్ధంగా ఉండండి

• రైతు గ్రూపులకు కిసాన్ డ్రోన్‌లను పంపిణీ చేయండి
• కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో వేరుశనగ విత్తనకాయల పంపిణీకి అవసరమైన చర్యలతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. ఈ నెలాఖరులోగా కిసాన్ డ్రోన్లను పంపిణీ చేయాలని చెప్పారు. కలెక్టర్ బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్-2025కు సంబంధించి 50,592 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కాయలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. జిల్లాకు 35 డ్రోన్‌లు కేటాయించారన్నారు. 31 మండలాల పరిధిలో గుర్తించిన 26 గ్రూపులకు రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మిగిలిన గ్రూపులను ఎంపిక చేసి ఈ నెలాఖరులోగా డ్రోన్‌లు పంపిణీ చేయాలన్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలన్నారు. హెచ్ఎల్ఎంసీ కాలువకు ఇరువైపులా ఉద్యాన పంటలు సాగయ్యేలా చూడాలన్నారు. కాలువ గట్టుపై టేకు మొక్కల ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, ఉద్యాన శాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ ఫిరోజ్‌ఖాన్, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, డీసీఓ అరుణ కుమారి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్, ఏడీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా
అనంతపురం కార్పొరేషన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే వ్యాపారులకు జరిమానా విధిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం నగరంలోని హౌసింగ్ బోర్డు సెవెన్‌హిల్స్ కాలనీలో ఇంటింటా చెత్త సేకరణను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని ముస్తాఫా అనే వ్యక్తి కలెక్టర్‌కు విన్నవించగా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ బాలస్వామిని ఆయన ఆదేశించారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వాడకుండా పబ్లిక్ నోటీసును జారీ చేయాలన్నారు. ప్రతి షాపు వద్ద తడి, పొడి చెత్త డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్, ఇన్‌చార్జ్ ఈఈ బీఎల్ నరసింహ తదితరులున్నారు.

కేంద్రం ఆధీనంలోకి 'ఉపాధి'

• అక్రమాలను అరికట్టేందుకు చర్యలు
• ప్రత్యేకంగా 'యుక్తధార్' యాప్
• పనుల గుర్తింపు, బిల్లుల చెల్లింపులు సైతం యాప్ ద్వారానే..



కంబదూరు వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇక పూర్తి స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి వెళ్లిపోనుంది. రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణ సైతం ఉండకుండా 'కేంద్రం' అంతా తానై పథకాన్ని నడపనుంది. ఉపాధి హామీ పథకానికి ఏటా కేంద్రం బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తోంది. అయితే, నిధుల ఖర్చు, పనుల గుర్తింపు తదితర వాటిని అమలు చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకునేది. దీంతో పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలున్నాయి.ఈ క్రమంలో అక్రమాలు అరికట్టి పారదర్శకంగా పథకాన్ని అమలు చేయాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా 'యుక్తధార్' పేరిట యాప్ తీసుకొచ్చింది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని 31 మండలాల్లో మండలానికి ఒక పంచాయతీ చొప్పున 31 చోట్ల 'యుక్తధార్' పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు.యాప్‌పై అవగాహన కల్పించేందుకు ఉపాధి హామీ సిబ్బందికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సదస్సులను నిర్వహిస్తున్నారు.

సర్వం యాప్ ద్వారానే..
ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న ఉపాధి పనుల గుర్తింపు దగ్గర నుంచి పనులకు వచ్చే కూలీల వివరాలు, బిల్లుల చెల్లింపులు తదితరాలన్నీ 'యుక్తధార్' యాప్ ఆధారంగానే జరగనున్నాయి. జియోస్పేషియల్ ప్లానింగ్ పోర్టల్‌కు అనుగుణంగా 'యుక్తధార్' పనిచేస్తుంది. ఈ క్రమంలో ఉపాధి పనులను గుర్తించిన అనంతరం వాటిని జియోట్యాగ్ ద్వారా యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పనులకు వచ్చే కూలీల వివరాలు సైతం పొందుపరచాలి. జియోట్యాగ్ చేసిన పనుల వద్దే కూలీల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ క్రమంలో అవకతవకలకు తావుండదు. కూలీలకు వేతనాలు కూడా త్వరగా విడుదలవుతాయి. కేంద్ర ప్రభుత్వ చర్యలతో గ్రామ పంచాయతీల్లో ప్రణాళికలు సులభతరం కానున్నట్లు డ్వామా అధికారులు చెబుతున్నారు.

31 పంచాయతీల్లో యుక్తధార్ ద్వారా పనులు



పైలట్ ప్రాజెక్టు కింద జిల్లా వ్యాప్తంగా ఉన్న 31 మండలాల్లో మండలానికి ఒక పంచాయతీ చొప్పున 31 గ్రామ పంచాయతీల్లో 'యుక్తధార్' పోర్టల్ ద్వారా ఉపాధి హామీ పనులను చేపడుతున్నాం. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యుక్తధార్ యాప్‌నకు అనుసంధానం చేసింది. పనుల గుర్తింపు దగ్గర నుంచి బిల్లుల చెల్లింపు వరకూ అన్ని వివరాలు ఈ యాప్ ద్వారానే నడవనున్నాయి. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో అన్ని పంచాయతీల్లో అమలు చేయనున్నాం.
–సలీంబాషా, డ్వామా పీడీ

విశ్రాంత డీఈఓ ఆనందమూర్తి కన్నుమూత



అనంతపురం ఎడ్యుకేషన్: విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి సెట్టిల ఆనందమూర్తి (74) కన్నుమూశారు. అనంతపురం నగరంలోని అరవిందనగర్‌లో నివాసముంటున్న ఆయన.. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారం రోజుల క్రితం ఆస్పత్రిలో చేరారు. ఈ క్రమంలోనే పరిస్థితి విషమించి బుధవారం తుదిశ్వాస విడిచారు. ఆనందమూర్తి సొంతూరు శెట్టూరు మండలం ములకలేడు గ్రామం. భార్య 2008లోనే మృతి చెందారు. వీరికి ముగ్గురు కుమారులు సంతానం కాగా... ఇద్దరు హిందీ పండిట్లుగా, ఒకరు పీఈటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆనందమూర్తి భౌతికకాయానికి గురువారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా.. ఆనందమూర్తి 1980లో జేఎల్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. పదోన్నతిపై 1996 నుంచి 2004 వరకు పరిషత్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పని చేశారు. తర్వాత 2004 నుంచి 2006 వరకు జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత ఐటీడీఏ, ఎస్సీఈఆర్టీలో పని చేసి 2008లో రిటైర్డ్ అయ్యారు. ఆయన మృతి పట్ల ఎంఈఎఫ్ నాయకులు బండారు శంకర్, హనుమంతరావు, రమేష్, రామన్న తదితరులు సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అప్పట్లో 'సింగిల్ ఆర్డర్లు' కలకలం..
ఆనందమూర్తి డీఈఓగా పనిచేసిన కాలంలో జిల్లాలో టీచర్ల బదిలీలకు సంబంధించి 'సింగిల్ ఆర్డర్లు' అంశం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రభుత్వం జారీ చేసిన బదిలీలతో పాటు ఆయా ఖాళీలకు డీఈఓ సింగిల్ ఆర్డర్ ఇచ్చి బదిలీలు చేశారు. ఒత్తిళ్ల కారణంగా డీఈఓ కొన్ని ఆర్డర్లు ఇస్తే వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసి అప్పట్లో కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తమకు అనుకూలమైన వారికి చాలా ఆర్డర్లు ఇప్పించుకున్నారు. ఇంకా కొందరు డీఈఓ సంతకాలను సైతం ఫోర్జరీ చేసి ఆర్డర్లు ఇచ్చారు. ఇలా చేసి పలువురు నాయకులు భారీగా వెనకేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో డీఈఓను విశాఖ జిల్లా అరకు ఐటీడీఏకు బదిలీ చేశారు.

కళ్లకు కట్టారు.. అవగాహన పెంచారు



అనంతపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో బుధవారం జిల్లా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ ఆకట్టుకుంది. విపత్తులు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలా వ్యవహరించాలనే విషయాలను అగ్నిమాపక సిబ్బంది కళ్లకు కట్టినట్లు చూపించారు. 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా అవగాహన కార్యక్రమం చేపట్టారు. బాంబులు పేలిన సమయంలో హెచ్చరిక సైరన్ మోగించడం నుంచి క్షతగాత్రులను ఆస్పత్రులకు చేర్చడం, సీపీఆర్ చేయడం తదితర విషయాలను క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ విపత్తుల సమయంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే నష్టం గణనీయంగా తగ్గించవచ్చన్నారు. అనంతరం పిల్లలు, యువతకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాస రెడ్డి, ఆర్డీఓ కేశవ నాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, తహసీల్దార్ హరిప్రసాద్ పాల్గొన్నారు.
– అనంతపురం



వ్యక్తిని పై అంతస్తు నుంచి తాడు ద్వారా కిందికి దించుతున్న దృశ్యం, వృద్ధురాలికి పరీక్షలు చేస్తున్న డాక్టర్లు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బీపీఈడీ ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య బి.అనిత బుధవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 73.77 శాతం, మూడో సెమిస్టర్‌లో 82.26 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో చూడవచ్చు. అలాగే బీఎస్సీ, బీకాం, బీసీఏ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ దరఖాస్తుకు ఈ నెల 30 చివరి తేదీగా నిర్దేశించినట్లు అనిత పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ ఈ.రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సి.లోకేశ్వర్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్ సర్వీస్ టీచర్లపై వివక్ష వీడాలి



డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రస్తుతం చేపట్టనున్న ఉపాధ్యాయుల బదిలీల్లో ఇన్ సర్వీస్ టీచర్లపై ప్రభుత్వం వివక్ష చూపుతోందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. వివక్షను వీడాలంటూ బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నీలూరి రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన సౌకర్యం ప్రకారం ఉన్నత ప్రమోషన్ కోసం ఇన్‌సర్వీస్‌లో బీఈడీ చేయడం ఉపాధ్యాయుల హక్కు అన్నారు. 8 ఏళ్లు పూర్తయిన వారికి, రేషనలైజేషన్ గురైన వారికి ప్రస్తుత బదిలీల్లో అవకాశం కల్పించాలన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల స్థానాల్లో మిగులు టీచర్లు, ఎంటీఎస్ ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు సురేష్‌కుమార్, మల్లికార్జున, ఉపాధ్యాయులు రామన్న, ఓబన్న, ఆదినారాయణ, మురళి, సుమలత, సరోజబాయి, పెద్దన్న, మేరీలత, చంద్రశేఖర్, మహేష్, మహాలక్ష్మి ఉన్నారు.

డ్రోన్ వినియోగంపై దృష్టి సారించండి : డీడీహెచ్

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టడానికి వీలుగా డ్రోన్‌లను వినియోగించేలా రైతుల్లో అవగాహన పెంచాలని ఉద్యానశాఖ అధికారులకు ఆ శాఖ డీడీ జి.ఫిరోజ్‌ఖాన్ సూచించారు. బుధవారం స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో సూపరెండెండెంట్ బాషా, టెక్నికల్ హెచ్‌ఓ రత్నకుమార్, ఉద్యానాధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఉద్యాన రంగం పురోభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించినందున వాటి ఫలాలు రైతులకు అందేలా క్షేత్రస్థాయిలో హెచ్‌ఓలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. డ్రోన్ వినియోగంపై ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ కింద గార్లదిన్నె మండలం ముకుందాపురం రైతులను చైతన్య పరిచినట్లు తెలిపారు. హంద్రీ-నీవా కాలువ వెంబడి ఉద్యాన పంటల పెంపకం ప్రోత్సహించాలన్నారు. అలాగే హెచ్చెల్సీ వెంబడి కూడా కొబ్బరి, వెదురు, అరటి, మునగ లాంటి పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. అరటి, మామిడి పండ్లకు వాడే కవర్లు రాయితీతో అందించాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ, వాడకంలో కూడా రైతులకు మేలు జరిగేలా చూడాలని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి సూచించారు.

ఖరీఫ్ సాగులో వైవిధ్యం

పెరిగిన కంది, కొర్ర, మొక్కజొన్న

- గత ఖరీఫ్‌లో రికార్డు స్థాయిలో 1.03 లక్షల హెక్టార్లలో కంది సాగు
- 3 వేల హెక్టార్లలో కొర్ర, 20 వేల హెక్టార్లకు పెరిగిన మొక్కజొన్న
- పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో భారీగా తగ్గిన వేరుశనగ, పత్తి



గత ఖరీఫ్‌లో సాగైన కంది పంట



మొక్కజొన్న

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ పంటల సాగులో వైవిధ్యం కనిపిస్తోంది. ఒకట్రెండు పంటలపై ఆధారపడకుండా రైతులు మరికొన్ని పంటల సాగుపై దృష్టి సారించారు. అలాగే పెరిగిన పెట్టుబడులు, కూలీల కొరతను దృష్టిలో పెట్టుకుని తక్కువ పెట్టుబడుల పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా కొన్ని దశాబ్దాలుగా ఏకపంటగా లక్షల హెక్టార్లలో సాగవుతున్న వేరుశనగ క్రమేణా సాగు విస్తీర్ణం తగ్గుముఖం పట్టింది. నల్లరేగడి భూముల్లో కేవలం తెల్లబంగారాన్ని నమ్ముకున్న రైతులు ఇటీవల పత్తి సాగును తగ్గించారు. వేరుశనగ, పత్తి స్థానాల్లో కంది, మొక్కజొన్న బాగా పెరిగింది. అలాగే పాతతరం పంట కొర్ర కూడా పెరుగుతోంది. పెసర, అలసంద, ఉలవ తగ్గిపోగా మినుము, సోయాపై మక్కువ చూపుతున్నారు. సజ్జ, జొన్న, పొద్దుతిరుగుడు పంటలు తగ్గుముఖం పట్టాయి.

గత ఖరీఫ్‌లో 'కంది' చరిత్ర

గత ఖరీఫ్‌లో కంది పంట చరిత్రను తిరగరాసింది. తొలిసారిగా లక్ష హెక్టార్లకు పైగా సాగులోకి రావడం గమనార్హం. గతేడాది కంది పంట 37,367 హెక్టార్లలో రావచ్చని అంచనా వేయగా... చివరకు ఏకంగా 1.03 లక్షల హెక్టార్లకు ఎకబాకింది. అంటే మూడింతల సాగు పెరిగింది. 31 మండలాల్లోనూ కందిపై రైతులు మొగ్గుచూపారు. ఉమ్మడి జిల్లా చరిత్రలో కూడా ఎప్పుడూ కంది పంట 70 వేల హెక్టార్లు దాటకపోవడం గమనార్హం. 11 వేల హెక్టార్లు సాధారణ సాగుగా అంచనా వేసిన మొక్కజొన్న 20 వేల హెక్టార్లకు పెరిగింది. ఇటీవల కాలంలో చాలామంది రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ రెండు పంటలకు పెట్టుబడులు తక్కువ కావడంతో విస్తీర్ణం క్రమేణా పెరుగుతోంది. కొర్ర కూడా 1,500 హెక్టార్లుగా అంచనా వేయగా రెట్టింపు విస్తీర్ణంలో 3 వేల హెక్టార్లకు పెరిగింది. ఇక ఐదారేళ్లుగా ఆముదం పంట కాస్త అటుఇటుగా 15 వేల హెక్టార్లతో స్థిరంగా కొనసాగుతోంది.

బాగా తగ్గిన వేరుశనగ, పత్తి

గతి తప్పిన వర్షాలు, పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధర లభించని కారణంగా రైతులు వేరుశనగ, పత్తి సాగును తగ్గించేశారు. గత ఖరీఫ్‌లో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 1.98 లక్షల హెక్టార్లు కాగా 57 శాతంతో 1.12 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. అలాగే పత్తి సాగు కూడా 48,586 హెక్టార్లకు గానూ 59 శాతంతో 28,530 హెక్టార్లలో వేశారు. ఖరీఫ్ జాబితాలో వేరుశనగ, పత్తి ప్రధాన పంటలుగా ఉండగా... ఇపుడు వాటి స్థానంలో కంది, మొక్కజొన్న పంటలు చేరుతున్నాయి. ఇక నీటి వసతి కింద 20 వేల నుంచి 22 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగులోకి వస్తోంది.

హైబ్రీడ్ విత్తన రకాలపై దృష్టి

కంది, మొక్కజొన్న పంటల విస్తీర్ణం పెరుగుతున్న తరుణంలో హైబ్రీడ్ రకాల విత్తనాలు రాయితీతో ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీతో పాతవి ఎల్ఆర్‌జీ రకాలు ఇస్తుండటంతో అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. ఎల్ఆర్‌జీ కంది రకాలు ఉచితంగా ఇచ్చినా వద్దనే పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో మంచి హైబ్రీడ్ రకాలు ఉన్నందున వాటిపై దృష్టి పెడుతున్నారు. అలాగే మొక్కజొన్న, ఆముదం కూడా రాయితీపై ఇస్తే చాలా వరకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.

● 'ఈతాకు' రక్ష

వందలాది ఎకరాల్లో సాగులో ఉన్న అరటి మొక్కలను కాపాడుకునేందుకు రైతులు సరికొత్త విధానాలను అనుసరిస్తున్నారు. యల్లనూరు మండలం వాసాపురం, బుక్కాపురం, బొప్పేపల్లి, దంతలపల్లి, నీర్జాంపల్లి, కొట్టాల, కూడేరు మండలం కడదరగుంట, కూడేరు, పి.నారాయణపురం, చోళసముద్రం, కొర్రకోడు, మరుట్ల, కలగళ్ల, గొటుకూరు. కమ్మూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో ఎండ తీవ్రతకు అరటి మొక్కలు మాడిపోకుండా ఉండేందుకు ఈతాకు రక్షణ వలయం ఏర్పాటు చేశారు. చిన్నపాటి చిట్కాతో భవిష్యత్తులో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు అవలంబిస్తున్న ఈ పద్ధతి పలువురిని ఆకర్షిస్తోంది.

– యల్లనూరు/కూడేరు:



యల్లనూరు మండలం వాసాపురంలో అరటి మొక్క ఎండకుండా ఈతాకుల రక్ష

మీ-సేవా కేంద్రంలో చోరీ




వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

గార్లదిన్నె: స్థానిక మీ సేవా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నెకు చెందిన సోమశేఖరరెడ్డి స్థానిక కెనరా బ్యాంక్ సమీపంలో మీ సేవా కేంద్రం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం లావాదేవీలు ముగించుకున్న అనంతరం రాత్రి తాళం వేసి ఇంటికెళ్లిపోయాడు. అర్ధరాత్రి సమయంలో దుండగులు మీసేవా కేంద్రం తాళాలు బద్దులుగొట్టి లోపలకు ప్రవేశించి, రూ.1.50 లక్షల నగదు అపహరించారు. బుధవారం ఉదయం కేంద్రం వద్దకు చేరుకున్న సోమశేఖరరెడ్డి చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి దుండగుల వేలి ముద్రలు సేకరించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి ముగ్గురు వ్యక్తులు ముసుగులు ధరించి వచ్చినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

విశిష్ట వేడుకకు వేళాయె

- నేడు ప్రసన్న వేంకటరమణ స్వామి కల్యాణోత్సవం
- తొమ్మిదేళ్ల మైనర్ బాలికతో శ్రీవారి వివాహ ఘట్టం
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూర్తయిన ఏర్పాట్లు



వెంకటరమణస్వామి ఆలయం

రాయదుర్గం టౌన్: విశిష్ట వేడుకకు స్థానిక కోట ప్రాంతంలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయం ముస్తాబైంది. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకూ కొనసాగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముఖ్య ఘట్టమైన శ్రీవారి కల్యాణోత్సవం ఈ నెల 15న గురువారం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా 8 లేదా 9 ఏళ్ల మైనర్ బాలికతో శ్రీవారి వివాహం జరిపించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. నిశ్చితార్థం మొదలు కల్యాణం వరకూ అన్ని శాస్త్రబద్ధంగా పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య జరిగే వివాహ తంతు దాదాపు 60 ఏళ్ల క్రితం పద్మశాలియ వంశస్తుల ఆధ్వర్యంలో కొనసాగుతూ వస్తోంది. ఏటా పద్మశాలియ వంశంలో అరవ తెగకు చెందిన బాలికతో వివాహం జరిపిస్తుంటారు. ఈ నెల 15న గురువారం 11.30 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవానికి పండితులు ముహూర్తం నిర్ణయించారు. అరవా శ్రీనివాసులు, శ్వేత దంపతుల కుమార్తె శ్రీధన్యతో శ్రీవారి వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. వేడుకలో భాగంగా పెళ్లి పెద్దలుగా శ్రీవారి తరపున బ్రాహ్మణులు, ఆలయ పాలక మిటీ సభ్యులు, పుర ప్రముఖులు మేళతాళాలతో పెళ్లి కూతురు పద్మావతిని (శ్రీధన్య)ను ఊరేగింపుగా మార్కండేయస్వామి ఆలయానికి తీసుకొస్తారు. అక్కడి నుంచి పెళ్లి కుమార్తెను అలంకరించి కోటలోని శ్రీవారి సన్నిధికి తీసుకెళ్లి వేద మంత్రోచ్ఛరణలతో వివాహం జరిపిస్తారు.

హంద్రీ-నీవాపై బహిరంగ చర్చకు సిద్ధం

- ఉరవకొండ వేదికగానే తేదీ, సమయం చెప్పండి
- ప్రభుత్వ విప్ కాలవకు ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ప్రతి సవాల్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లు టౌన్: హంద్రీ-నీవా కెనాల్ పనులు పూర్తి చేసిందెవరు? అందుకు ఎవరెంత నిధులిచ్చారో చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రకటించారు. హంద్రీ-నీవాకు శిలాఫలకం వేసిన ఉరవకొండలోనే బహిరంగంగా చర్చిద్దామని, తేదీ, సమయమెప్పుడో నిర్ణయించాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు ఆయన ప్రతి సవాల్ విసిరారు. బహిరంగ చర్చ జరిగే రోజున పోలీసులపై ఒత్తిడి తీసుకెళ్లి తమను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయించొద్దని విజ్ఞప్తి చేశారు. బుధవారం గుంతకల్లుకు విచ్చేసిన ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి, మైసూరారెడ్డి సారథ్యంలో మొదలైన రాయలసీమ ఉద్యమంపై అప్పటి సీఎం ఎన్టీ.రామారావు స్పందించి హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తిరిగి తొమ్మిదేళ్లు సీఎంగా కొనసాగిన చంద్రబాబు హంద్రీ-నీవాకు రెండుసార్లు శంకుస్థాపన చేయడం తప్ప సాధించిన ప్రగతి అంటూ ఏదీ లేదన్నారు. 2004లో వైఎస్.రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యాకనే హంద్రీ-నీవా పనులు వేగవంతమయ్యాయన్నారు. హంద్రీ-నీవా గురించి అన్నీ తెలిసిన కాలవ శ్రీనివాసులు నేడు ఏమీ తెలియనట్టు నటిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హంద్రీనీవాలో 6,300 క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారని, తిరిగి కూటమి ప్రభుత్వం 3,850 క్యూసెక్కులకే పరిమితం చేయడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి, మంత్రి కేశవ్‌కు, విప్ కాలవకు చిత్తశుద్ధి ఉంటే 10 వేల క్యూసెక్కులకు హంద్రీ-నీవా సామర్థ్యం పెంచేలా పనులు చేపట్టాలని సవాల్ విసిరారు.

మురళీనాయక్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరుడైన జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. జవానుల వీరోచిత పోరాటాన్ని ఆయన కొనియాడారు. మురళీనాయక్‌తో పాటు యుద్ధంలో అసువులు బాసిన జవానులు, పహల్గామ్ ఘటనలో మృతి చెందిన అమాయకపు ప్రజల మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. సమావేశంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, రాము, కౌన్సిలర్ చాంద్‌బాషా, పార్టీ సీనియర్ నేతలు భీమలింగప్ప, దశరథరెడ్డి, కాకర్ల నాగేశ్వరరావు, నిజామి, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు రంగనాయకులు, బాసిద్, బాబూరావు పాల్గొన్నారు.

యువ రైతు ఆత్మహత్య



రవియాదవ్ (ఫైల్)

విడపనకల్లు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం వి.కొత్త కోటకు చెందిన కోనంపల్లి రవియాదవ్ (26), కొంత కాలంగా మిర్చి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో పంటల సాగుకు చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. ఈ ఏడాది పంట ఆశాజనకంగా ఉండడంతో అప్పులు తీరిపోతాయని భావించాడు. అయితే పంట చేతికి వచ్చిన తర్వాత మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఒక్కసారిగా కుదేలయ్యాడు. కనీసం పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో ఇక అప్పులు తీర్చకపోతే గ్రామంలో పరువు పోతుందని భావించిన రవి యాదవ్.. బుధవారం తెల్లవారుజామున తన ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్డులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్థిక అసమానతల వల్లే మతమార్పిడి

- వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి రాఘవులు



రాఘవులతో జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: సమాజంలో పెరిగిన ఆర్థిక అసమానతల వల్లనే మత మార్పిడులు జరుగుతున్నాయని వీహెచ్‌పీ జాతీయ కార్యదర్శి వై.రాఘవులు అన్నారు. బుధవారం అనంతకు విచ్చేసిన ఆయన స్థానిక కోర్టురోడ్డులోని శివకృప (ఆర్ఎస్ఎస్ భవన్)లో జిల్లా అర్చక ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. సనాతన హైందవ ప్రచారానికి ప్రాముఖ్యతనిచ్చే అర్చకులు మరిన్ని మార్గాల ద్వారా ధర్మాన్ని కాపాడాలని సూచించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు దేశకాల పరిస్థితులను వివరించడం, పరిణామ సంకీర్తనలు చేయించడం, సేవా కార్యక్రమాలలో అందరినీ భాగస్వాములను చేయడం ద్వారా మత మార్పిడులను అరికట్టవచ్చన్నారు. అనంతరం అర్చక సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు నేతృత్వంలో ఎండోమెంటు సహాయ కమిషనర్ ఆదిశేషు నాయుడిని కలిసి అర్చక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య ప్రతినిధులు తిరుపతయ్య, శ్రీనివాసులు, మారుతీప్రసాద్, వీహెచ్‌పీ ఉపాధ్యక్షుడు కేవీ రమణబాబు, జిల్లా కార్యదర్శి విశ్వనాథరెడ్డి, సభ్యులు గురప్ప, దినేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్నాతకోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహిద్దాం


- జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు



స్నాతకోత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) 14వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 17న పకడ్బందీగా నిర్వహిద్దామంటూ సంబంధిత అధికారులకు వర్శిటీ వీసీ హెచ్.సుదర్శనరావు పిలుపునిచ్చారు. స్నాతకోత్సవం నిర్వహణపై సమన్వయ కమిటీ సభ్యులతో బుధవారం వీసీ సమీక్షించారు. ఏపీ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చాన్సలర్ హోదాలో స్నాతకోత్సవంలో పాల్గొంటారని, గౌరవ డాక్టరేట్‌ను డాక్టర్ చావా సత్యనారాయణకు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ నేపథ్యంలో హాజరుకానున్న ప్రముఖులకు ఎలాంటి లోటుపాట్లు రానివ్వరాదన్నారు. ఉదయం 9:30 గంటల్లోపు గోల్డ్‌మెడల్స్ గ్రహీతలు, పీహెచ్‌డీ అవార్డులు పొందిన విద్యార్థులు ఆడిటోరియానికి చేరుకునేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ ఎస్.దేవన్న, డైరెక్టర్లు పాల్గొన్నారు.

యువకుడి గల్లంతు





బావిలో గాలిస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) రాజశేఖర్ (ఫైల్)

రాయదుర్గం టౌన్: స్నేహితులతో కలసి ఈతకు వెళ్లిన ఓ యువకుడు బావిలో గల్లంతయ్యాడు. వివరాలు... రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రి వెనుక వీధిలో నివాసముంటున్న సత్యనారాయణ, పద్మ దంపతుల కుమారుడు బోయ రాజశేఖర్ (30)కు భార్య నేత్ర, ఇద్దరు కుమారులు ఉన్నారు. గార్మెంట్స్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం నలుగురు స్నేహితులతో కలసి రాజశేఖర్ స్థానిక దుగ్గిలమ్మ ఆలయం వద్ద ఉన్న బావిలో ఈతకు వెళ్లాడు. బావిలో దిగిన రాజశేఖర్ కొద్ది సేపటికే గల్లంతయ్యాడు. దీంతో భయపడిన స్నేహితులు బయటకు వచ్చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు విషయం తెలుసుకున్న బంధువులు, పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చేపట్టారు. గత ఈతగాళ్లను రంగంలో దించారు. బావిలో పూర్తి స్థాయిలో నీరు ఉండడం, లోతు కూడా ఎక్కువగా ఉండడంతో ఆచూకీ లభ్యం కాలేదు. సీఐ జయనాయక్ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కాగా, ఈత రాని రాజశేఖర్‌ను స్నేహితులు బలవంతం చేయడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. అంతేకాక అప్పటికే స్నేహితులందరూ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం.

ఫైనల్‌కు కదిరి, అనంత జట్లు

అనంతపురం: సీనియర్ క్రికెటర్ ఎస్.చంద్రమోహన్ స్మారకార్థం నిర్వహిస్తున్న సీనియర్ టీ-20 క్రికెట్ టోర్నీలో కదిరికి చెందిన ఏడీసీఏ క్యాంప్ జట్టు, అనంత రైజింగ్ స్టార్ జట్టు ఫైనల్‌కు చేరాయి. బుధవారం జరిగిన తొలి సెమీఫైనల్ మ్యాచ్‌లో కదిరి, జీఎస్‌జీ అనంతపురం జట్లు తలపడ్డాయి. కదిరి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. జట్టులో బ్యాటర్ పి.గిరినాథరెడ్డి 49 బంతుల్లో 67 పరుగులు సాధించాడు. మరో బ్యాటర్ వెంకట సాయి 31 బంతుల్లో 48 పరుగులతో జట్టుకు మంచి స్కోరు అందించాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జీఎస్‌జీ అనంతపురం జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 144 పరుగులు చేసి ఓటమి పాలైంది.

- అనంత రైజింగ్ స్టార్, ఫ్యామిలీ క్లబ్ అనంతపురం జట్ల మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 153 పరుగులు చేసింది. జట్టులో బి.ప్రశాంత్ 37 పరుగులు, లోహిత్ సాయి కిశోర్ 22 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఫ్యామిలీ క్లబ్ జట్టు 18.5 ఓవర్ల వద్ద 121 పరుగులకు కుప్పకూలింది. కేహెచ్ వీరారెడ్డి 27 బంతుల్లో 48 పరుగులు, వెంకట్ లోకేష్ 20 పరుగులతో రాణించినా ఫలితం దక్కలేదు. రైజింగ్ స్టార్ బౌలర్ దత్తారెడ్డి అద్భుతమైన బౌలింగ్‌తో మూడు వికెట్లు తీసి ఫ్యామిలీ క్లబ్ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేశాడు.

'కోర్'లో 'కృత్రిమ మేధ'

- బీబీఏ, బీసీఏ కోర్సుల్లోనూ అమలు

అనంతపురం: అన్ని రంగాల్లోనూ భవిష్యత్తులో కృత్రిమ మేధ శాసించనుందా? అన్ని రంగాల వారు తప్పని సరిగా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పై అవగాహన పెంచుకోవాలా? ఏఐ నైపుణ్యత తప్పనిసరి అవుతోందా?.. ఈ ప్రశ్నలన్నింటికీ అవుననే నిపుణులు సమాధానమిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేవలం సాంకేతిక విద్యలోనే కాదు.. కోర్ బ్రాంచ్‌ల్లోనూ ఏసీ తప్పనిసరి అని సూచిస్తున్నారు.

మైనర్ సబ్జెక్ట్‌గా 'ఏఐ'

ప్రస్తుతం కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులు మైనర్ సబ్జెక్టుగా ఏఐని ఎంచుకునే అవకాశం దక్కింది. ఈ క్రమంలో విడిగా కాకుండా ఎంచుకున్న సబ్జెక్టు లేదా రంగంలో ఏఐని కలిపి అభ్యసిస్తే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో అన్ని కళాశాలల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు అందుబాటులోకి వచ్చింది. ఇందుకు అనుగుణంగా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఇంజినీరింగ్ విద్యను మార్పులు తీసుకువచ్చేందుకు సమాయత్తమవుతోంది.

బీసీసీ, బీబీఏ కోర్సుల్లోనూ..

ఇంజినీరింగ్ కోర్ బ్రాంచులైన మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, కెమికల్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, ఏరో స్పేస్, టెక్స్‌టైల్స్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ తదితర బ్రాంచీలతో పాటు బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(బీబీఏ), బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్(బీసీఏ) వంటి కోర్ బ్రాంచ్‌ల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలని ఏఐసీటీఈ నిర్ణయించింది. ప్రత్యేకంగా ఏఐ పాఠాలు కాకుండా ..కోర్ బ్రాంచ్‌ల్లోని సిలబస్‌లో అవసరమైన చోట కృత్రిమ మేధ పాఠ్యాంశాలను అనుసంధానం చేయనున్నారు. ఈ మేరకు రూపొందించిన నూతన విద్యా ప్రణాళికను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి తీసుకరానున్నారు. ఇందు కోసం ఐఐటీలు, ఎన్ఐటీలు, సాంకేతిక వర్సిటీల్లోని ప్రొఫెసర్లతో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో జేఎన్‌టీయూ (ఏ)కు చెందిన ప్రొఫెసర్లూ ఉన్నారు.

అధ్యాపకులకూ ఫెలోషిప్..

ఇంజినీరింగ్ అధ్యాపకులు సైతం పరిశ్రమల్లో రియల్‌టైమ్ అనుభవం పొందేందుకు ఏడాది పాటు ఫెలోషిప్‌ను ఏఐసీటీఈ అందించనుంది. అధ్యాపకులు ఏడాదిపాటు పరిశ్రమల్లో పని విధానాన్ని నేర్చుకోవాల్సి ఉంటుంది. ఇందుకు గౌరవ వేతనంగా ఏఐసీటీఈ రూ.75 వేలు చెల్లిస్తుంది. ఆయా కంపెనీలు మరో రూ.25 వేలు అందిస్తాయి. 45 ఏళ్ల లోపు వయస్సున్న 300 మంది అధ్యాపకులకు అవకాశం కల్పిస్తారు. దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారు. దీనిపై ఏఐసీటీఈ ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేసింది. ఏడాది తర్వాత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను సిద్ధం చేసేలా విద్యార్థులకు బోధించాల్సి ఉంటుంది.

వ్యక్తి అనుమానాస్పద మృతి



యల్లప్ప (ఫైల్)

కణేకల్లు: మండలంలోని మాల్యం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న హరిజన యల్లప్ప (70) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. వర్షానికి కారుతున్న తన పూరి గుడిసెను మరమ్మతు చేసేందుకు అవసరమైన ఆపు (గడ్డి) కోసుకొచ్చేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు గ్రామ శివారులోని వంక వద్దకు వెళ్లాడు. గంట తర్వాత ఇద్దరు మనవళ్లు తాతకు తాగునీటి బాటిల్ ఇచ్చేందుకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడ యల్లప్ప కనిపించలేదు. దీంతో పిల్లలు ఇంటికెళ్లి విషయాన్ని తమ తండ్రి రమేష్‌కు తెలపడంతో ఆయన అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కడ అచేతనంగా పడి ఉన్న యల్లప్పను గమనించి వెలికి తీశాడు. అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, ఆపు కోస్తున్న సమయంలో నీళ్లలో నుంచి విద్యుత్ ప్రసారం జరిగి మృతి చెందాడా? లేక, గుండెపోటుతోనా? వడదెబ్బతోనా అనే అనుమానాలు వ్యక్తం కాగా పోలీసులు ఆ దిశగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

సేవ దైవకార్యంతో సమానం



నిత్యావసరాలు అందజేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: నిరుపేదలకు సేవ చేయడమంటే దైవకార్యంతో సమానమేనని మేయర్ వసీం అన్నారు. బుధవారం నగరంలోని ఆజాద్‌నగర్ గరీబ్ కా దర్ద్ ట్రస్టు ఆధ్వర్యంలో పేదల వివాహాలకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. మేయర్ వసీం, దిశా డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ.. ఇతరులకు సేవ చేయడం కోసం కోవిడ్‌లో కూడా గరీబ్ కా దర్ద్ ట్రస్టు అధ్యక్షుడు జిలాన్ ఆధ్వర్యంలో ఎంతో కృషి చేసిందన్నారు. అలాగే ఎంతో మంది అంత్యక్రియలను స్ఫూర్తిదాయకంగా నిర్వహించారని కొనియాడారు. పేదలకు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని తెలిపారు. యువత ఆదర్శంగా తీసుకుని సేవారంగాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్ మదని, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతకుంట మధు, బాస్కరరెడ్డి, కాకర్ల శీను, జిలాన్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో ప్రతిభ

అనంతపురం: అనంతలక్ష్మి పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. 500 మార్కులకు గాను శాన్వి 489, లవకుమార్ 466, మునిత శ్విక 463, ఎల్‌జీ ఆంచల్ 453, కే.సంజన 453, సీవి సుశాంత్ 448 మార్కులు సాధించారు. బుధవారం విద్యార్థులను అనంతలక్ష్మి పాఠశాల చైర్మన్ అనంత రాముడు అభినందించారు.

మైనార్టీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు

అనంతపురం కల్చరల్: ఇండియన్ ముస్లిం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తామని నిర్వాహకుడు మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం ఐఎంఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిభావంతుల వివరాలను సేకరించిన అనంతరం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9985590543 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జాకీర్ హుస్సేన్, అమ్మ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు ముక్తియార్, ఇసాక్, పీఎస్‌బాబా ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ డీలర్‌పై దాడి



గాయపడిన లక్ష్మన్న

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన మాజీ స్టోర్ డీలర్ లక్ష్మన్నపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు లక్ష్మన్న తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం రాప్తాడు పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సీఐ సర్‌ను కలవాలని మాజీ స్టోర్ డీలర్ లక్ష్మన్నకు ఫోన్ చేశారు. దీంతో లక్ష్మన్న నేను బయట ఉన్నాను.. సాయంత్రం 4 గంటలకు వచ్చి సీఐ సర్‌ను కలుస్తానని బదులిచ్చాడు. సాయంత్రం 4 గంటలకు లక్ష్మన్న పోలీస్‌స్టేషన్ దగ్గరకు వచ్చాడు. బండి బయట పెట్టి లోపలికి వెళ్తుండగా రాప్తాడుకు చెందిన మారుతి, నారాయణ, జగదీష్ ముగ్గురు పోలీస్‌స్టేషన్ ముందే లక్ష్మన్నపై దాడి చేశారు. నన్ను ఎందుకు కొడుతున్నారని లక్ష్మన్న అడిగినా చెప్పకుండా కొట్టారు. ముగ్గురి నుంచి తనకు ప్రాణహాని ఉందని.. వారిపై కేసు నమోదు చేయాలని లక్ష్మన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైనిక్ స్కూల్‌గా శ్రీరామా రూరల్ హైస్కూల్



పోస్టర్లు విడుదల చేస్తున్న శ్రీరామా రూరల్ అకాడమీ అధ్యక్షుడు తులసీ విష్ణు ప్రసాద్

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగంలో 75 ఏళ్లకు పైగా సేవలందిస్తున్న గుంటూరు జిల్లా కొల్లూరు మండలం చిలుమూరు సమీపంలోని శ్రీరామా రూరల్ అకాడమీ సైనిక్ స్కూల్‌గా మారబోతోంది. ఈ విద్యా సంవత్సరం (2025–26) నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు శ్రీరామా రూరల్ అకాడమీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర అధ్యక్షుడు కొలసాని తులసీ విష్ణు ప్రసాద్ తెలిపారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక అపుస్మా కార్యాలయంలో సైనిక్ స్కూల్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేసి, మాట్లాడారు. సైనిక్ స్కూల్ నిర్వహణకు అన్ని విధాలా అనువుగా ఉన్న శ్రీరామా రూరల్ హైస్కూల్‌కు అనుమతి ఇవ్వడం గర్వకారణమన్నారు. దేశ వ్యాప్తంగా పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో తొలివిడతగా 33, రెండోవిడతగా 42 సైనిక్ స్కూళ్లకు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సైనిక్ స్కూళ్ల సొసైటీ అనుమతి ఇచ్చిందన్నారు. సమావేశంలో అపుస్మా జిల్లా మాజీ అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతపై వడ్డీ భారం

- వడ్డీ రాయితీ, బీమా ప్రీమియం అందించని కూటమి ప్రభుత్వం
- వన్‌బీ, అడంగల్ కోసం రైతుల ఇక్కట్లు
- కొనసాగుతున్న ఖరీఫ్ రుణాల రెన్యూవల్స్



రుణాల రెన్యూవల్ కోసం వచ్చిన రైతులు

కనగానపల్లి: బ్యాంకుల్లో రైతుల ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం రైతులు మే, జూన్ నెలల్లో ఎక్కువగా పంట రుణాలు తీసుకొంటారు. కొత్త రుణాలతో పాటు గతంలో తీసుకొన్న రుణాలను రైతులు ఇప్పుడే రెన్యూవల్ చేసుకొంటారు. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఖరీఫ్ రుణాల రెన్యూవల్స్ జోరుగా సాగుతోంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట ఎక్కువగా సాగు చేసే కనగానపల్లి, రాప్తాడు, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఈ పంట రుణాలు తీసుకుంటారు. నియోజకవర్గంలో ఏటా సుమారు 65 వేల మంది రైతులు పంట రుణాలు రెన్యూవ్ చేయిస్తున్నట్లు సమాచారం.

ఖరీఫ్ పంట రుణాలు రెన్యూవల్ చేసుకొనే ఈసారి వడ్డీ భారం బాగా పెరిగిందని రైతులు వాపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

పెరిగిన వడ్డీ ..

లో పంట రుణాలు తీసుకొనే రైతులకు రూ.లక్ష సున్నా వడ్డీతో రుణాలు అందించటంతో పాటు మిగిలిన వారికి 3 శాతం వడ్డీ రాయితీ కల్పించేవారు. కాని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతా రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఎత్తివేయటంతో పాటు వడ్డీ రాయితీ కల్పించటం లేదు. దీంతో రైతులు 7 శాతంపైగా వడ్డీ చెల్లించి రుణాలు రెన్యూవల్ చేసుకొంటున్నారు. బ్యాంకు ఖర్చులతో కలసి రూ.లక్ష రుణానికి రూ.9 వేల వరకు వడ్డీ చెల్లించవలసి వస్తోందని రైతులు తెలిపారు. దీనికి తోడు పంటల బీమా చేసుకొనేందుకు చెల్లించే ప్రీమియం సొమ్ము కూడా గతంలో ప్రభుత్వమే చెల్లించేంటున్నారు. కాని ఈ సంవత్సరం ఇటువంటి రాయితీలు ఏమి లేకపోవటంతో రుణాలు రెన్యూవల్ చేసుకొనేందుకు భారంగా మారిందని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు చెందిన రైతులు వాపోతున్నారు.

బ్యాంకులో పంట రుణాలు పొందాలంటే రైతులు తాము సాగుచేస్తున్న భూముల వివరాలు తెలిపే

వన్‌బీ, అడంగల్ కోసం ప్రదక్షిణలు

వన్‌బీ, అడంగల్ కాపీలను అందజేయాలి. కాని ప్రస్తుతం చాలా గ్రామాల్లో ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ కాపీలు రావటం లేదని రైతులు చెపుతున్నారు. ముఖ్యంగా భూముల రీ సర్వే జరుగుతున్న రెవెన్యూ గ్రామాల్లో ఈ కాపీలు సరిగా రావడం లేదంటున్నారు. వీటి కోసం రోజూ రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మీ భూమి వెబ్‌సైట్‌లో తీసుకొన్న అడంగల్ కాపీలపై ఖచ్చితంగా వీఆర్వోతో పాటు తహసీల్దార్ సంతకం ఉండాలని బ్యాంకు అధికారులు నిబంధనలు పెడుతున్నారు. దీంతో రైతులు వీటిని కోసం మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కేంద్రాల వద్దకు తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం..

గత ప్రభుత్వ హయాంలో సున్నా వడ్డీకి రుణాలు తీసుకున్నాం. ఎటువంటి వడ్డీ, బీమా ప్రీమియం చెల్లించకుండా పంట రుణాలు రెన్యూవల్ చేసుకున్నాం. ప్రస్తుతం రూ.లక్ష రుణం తీసుకున్న వారు కూడా రూ.9 వేల దాకా వడ్డీ చెల్లిస్తున్నాం. దీనికి తోడు పంటల బీమాకు ప్రీమియం సొమ్ము కూడా రైతులే కట్టాలని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో రుణాలు రెన్యూవల్ చేసుకోవాలంటే భారంగా మారింది. – నారాయణప్ప, వేపకుంట

ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ రావడం లేదు

రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు వన్‌బీ, అడంగల్ కాపీలు తప్పనిసరిగా ఉండాలని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కాని ఆన్‌లైన్‌లో ఆ కాపీలు రావడం లేదు. దీంతో వీటి కోసం రెవెన్యూ అధికారులు, కార్యాలయాల చుట్టు తిరుగుతున్నాం. అయితే అధికారులు ఒక్కోసారి అందుబాటులో లేకపోతే రెన్యూవల్ చేసుకొనేందుకు ఆలస్యం అవుతోంది. – వెంకటరాముడు, ముక్తాపురం

సకాలంలో రెన్యూవల్ చేసుకోండి

రైతులు సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవాలి. రుణం తీసుకుని ఒక ఏడాది గడువు దాటితే వడ్డీ శాతం పెరగడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వర్తించవు. ఈ సంవత్సరం గ్రామీణ బ్యాంకులన్నింటినీ వీలనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్చారు. గతంలో ఉన్న కొన్ని బ్యాంకు నిబంధనలు మారాయి. వాటిని అనుసరించి రైతులకు పంట రుణాలు అందజేస్తాం. – గుణప్రసాద్, మేనేజర్, కనగానపల్లి గ్రామీణ బ్యాంక్

హాస్టళ్లను ఖాళీ చేయమంటే ఎలా?



రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించిన విద్యార్థులు

అనంతపురం: వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న తమను హాస్టళ్లను ఖాళీ చేయమంటే ఎలా అని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ పీజీ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్ బాబు చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు జూన్ 1న, డీఎస్సీ జూన్ 6 నుండి జూలై 6 వరకూ జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు స్టడీ హాల్, లైబ్రరీలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతుంటే ఇంటికి వెళ్లాలని కోరడం ఎంత వరకూ సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందరికీ కలిపి ఒక హాస్టల్ బ్లాక్ ఇచ్చినా సరిపోతుందని చెప్పినా.. ఎందుకు స్పందించడం లేదని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారు. గతంలో వచ్చిన గవర్నర్ ఉత్తర్వుల సాకుతో హాస్టళ్ల నుంచి విద్యార్థులను బయటకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు జయపాల్, కిరణ్, పులిరాజు, సురేంద్ర, తిరుపాల్, రాము, వీర, నాగేంద్ర, సుధాకర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ గౌస్‌మహమ్మద్ బాషా పేర్కొన్నారు. ఈనెల 6న తెలంగాణ రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లా కోసిగికి చెందిన బజారప్ప(51) బైక్‌పై వస్తూ తలగాచిపల్లి క్రాస్ వద్దకు ప్రమాదవశాత్తూ కిందపడ్డాడు. ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్‌కు తరలించగా అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ



మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా వ్యవహరిస్తున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా కడప మేయర్‌గా ఎన్నికై న సురేష్ బాబును సస్పెండ్ చేస్తూ.. సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుబడుతూ బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. కడప నగరపాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లు ఉండగా.. 49 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారన్నారు. అసత్య ఆరోపణలతో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని మేయర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేయడం అప్రజాస్వామికమన్నారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. నారా లోకేష్ కనుసన్నల్లో రెడ్ బుక్ రాజ్యాంగం కొనసాగుతోందన్నారు. కడప శాసన సభ్యురాలు మాధవిరెడ్డి తన నీచ సంస్కృతికి పాల్పడిన విషయాన్ని గతంలోనే చూశామన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలతో ప్రజాస్వామ్యంపై నమ్మకం సన్నగిల్లే పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని రాబోయే రోజుల్లో బుద్ధి చెబుతారన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



ప్లాస్టిక్ వ్యాపారులకు హెచ్చరిక జారీ చేస్తున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: 'నిషేధిత ప్లాస్టిక్‌ను అమ్మకూడదని చాలాసార్లు చెప్పాం. మీలో ఎటువంటి మార్పు రాలేదు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఇక నుంచి నగరంలో నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించరాదు. త్వరలో ప్లాస్టిక్‌పై స్పెషల్ డ్రైవ్ చేపడుతాం. ప్లాస్టిక్ దొరికితే మాత్రం చట్టపరమైన చర్యలు తప్పవు' అని వ్యాపారులను కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. బుధవారం నగరపాలక సంస్థలో ప్లాస్టిక్ వ్యాపారులతో (సేట్లు) కమిషనర్ సమావేశమయ్యారు. 56 షాపులకు నోటీసులు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్‌ను విక్రయించడం ద్వారా భవిష్యత్తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రమాదమన్నారు. నిబంధనలకు లోబడి ప్లాస్టిక్‌ను విక్రయించకూడదన్నారు. ప్రస్తుతం దాడులు చేస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. రూ.కోట్లతో సరుకు ఉంది, కొన్ని రోజులు సమయం ఇవ్వడంటూ ప్రదక్షిణలు చేయద్దని సూచించారు. ఇప్పటికే చాలాసార్లు చెప్పినా మీలో ఎటువంటి మార్పు రాలేదన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

దేవతలారా రండి.. దీవెనలు అందించండి



పూజలు చేస్తున్న అర్చకుడు



ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి



పన్నేరపు బండ్లను తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్క దేవతల జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. బుధవారం అక్క దేవతలను ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. విశేష పూజలు చేసి, మంగళహారతి ఇచ్చారు. పలువురు పన్నేరపు బండ్లను వివిధ రకాల రంగుల కాగితాలతో అలంకరించి ఆలయం చుట్టూ తిప్పారు. భక్తులు పెద్ద ఎత్తున టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు భక్తులకు ప్రసాదం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసి 21 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, చంద్రశేఖర్ యాదవ్, నాయకులు పెన్నోబులేసు, కొర్రపాడు హుస్సేన్ పీరా, రామయ్య, పాల్గొన్నారు.

అన్నదానం

అనంతపురం మెడికల్: ప్రముఖ వ్యాపారవేత్త హనుమంత రెడ్డి 4వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వద్ద 300 మందికి సాయి ట్రస్టు వారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబ జాతర ప్రారంభం

రామగిరి: మండలంలోని నసనకోటలో బుధవారం దుర్గాంబ జాతర ప్రారంభమైంది. గ్రామదేవతలైన గంగమ్మ, దుర్గమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, పోతులయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద సుమారు రూ.40 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన రక్షణగోడ, రైలింగ్, నాగుల కట్ట, అదనపు సౌకర్యాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. ఈనెల 18 వరకూ జాతర జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు.

గుంతల పూడ్చివేత



రైల్వే వంతెన సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలను తారుతో పూడ్చిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: మండలంలోని గంగలకుంట సమీపంలో 42వ జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. వాహనాలు దగ్గరికి వచ్చే వరకూ ఈ గుంతలు కనబడకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెలలో దాదాపుగా 10 మంది ద్విచక్ర వాహనాల్లో నుంచి కింద పడి గాయాలపాలయ్యారు. ఈ విషయంపై ఈనెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో 'ప్రయాణం.. నరకం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు 42వ జాతీయ రహదారి రైల్వే వంతెన సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను పరిశీలించారు. బుధవారం తమ సిబ్బందితో 42 జాతీయ రహదారిపై రైల్వే వంతెన సమీపంలో ఏర్పడిన గుంతలను తారుతో పూడ్చివేయించారు. గుంతలను పూడ్చడంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి వసతి కల్పనకు చర్యలు



ఆత్మకూరు సచివాలయంలో తాగునీటి కుండను ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని సచివాలయం -2కు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు కనీసం తాగునీరు కూడా లేకపోవడంతో బుధవారం సాక్షిలో 'తాగునీటి సౌకర్యం కల్పించండి సారూ..!' శీర్షికతో వార్త ప్రచురితమైంది. పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్ స్పందించి బుధవారం సచివాలయంలో ఓ పెద్ద కుండను ఏర్పాటు చేయించి తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పనుల మీద వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసుకుంటామని తెలిపారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



యల్లప్ప (ఫైల్)

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బిల్లే యల్లప్ప (56) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. యల్లప్ప గతంలో సర్పంచ్, సింగిల్ విండో ప్రెసిడెంట్‌గా సేవలందించారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు చాటుకున్నారు. యల్లప్ప మృతదేహానికి తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ బాల పోతన్న వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉలవచారులో ఉపేంద్ర సందడి



ఉలవచారు నిర్వాహకుడు వినయ్‌తో హీరో ఉపేంద్ర, ప్రియాంక, తార

అనంతపురం కార్పొరేషన్: స్థానిక 44వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఉలవచారు రెస్టారెంట్‌లో బుధవారం శాండిల్‌వుడ్ నటులు హీరో ఉపేంద్ర, నటి ప్రియాంక, తార సందడి చేశారు. రెస్టారెంట్‌లోని వంటకాలను ఆస్వాదించారు. సెలబ్రెటీల రాకతో రెస్టారెంట్ పరిసరాల్లో సందడి నెలకొంది. ఉపేంద్ర అభిమానులు పెద్ద ఎత్తున రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు. అంతకు ముందు ఉపేంద్ర బృందానికి ఉలవచారు వ్యవస్థాపకుడు వినయ్ నరహరి స్వాగతం పలికారు.

ఆగిన నిర్మాణం.. తప్పని వ్యథ



హంపాపురంలో అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

రాప్తాడు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అంగన్ వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేక అంగన్‌వాడీ చిన్నారులు అద్దె భవనాల్లో మగ్గుతున్నారు. మండలంలో నాడు–నేడు కార్యక్రమం కింద ఎం.బండమీదపల్లి, పాలచెర్ల, హంపాపురం, అయ్యవారిపల్లి గ్రామాలకు అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు కూడా ప్రారంభించి 30 నుంచి 60 శాతం పనులు కూడా పూర్తి చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ నిర్మాణాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. భవనాలు నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు, చిన్నారుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.